క్లుప్తంగా

నాయీబ్రాహ్మణుల హర్షం

అన్నవరం: దేవస్థానాల ధర్మకర్తల మండళ్లలో నాయీబ్రాహ్మణులను సభ్యులుగా నియమించడంపై రత్నగిరి దేవస్థానంలో కేశఖండనశాలకు చెందిన నాయీబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం మహిళా అధ్యక్షురాలు కాపవరపు శ్రీదేవి, నాయకులు కొరుప్రోలు గణేష్, మోహన్, వేంకట రమణ, కొరుప్రోలు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై సతీష్‌కు సత్కారం


ఏలేశ్వరంలో ఎస్సై సతీష్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై జి.సతీష్‌ను గురువారం మండల వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సైను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ సహకారం ఉంటుందన్నారు. దిశ చట్టం అమలుకు సంపూర్ణ మద్దతు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి, బీశెట్టి అప్పలరాజు, యిజనగిరి ప్రసాద్, రామిశెట్టి వెంకట రమణ, పసల నాగేశ్వరరావు, కూనపురెడ్డి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పెద్దాడ చంటమ్మ, నురుకుర్తి నాగలక్ష్మి కుటుంబాలకు పారుపాక మాజీ సర్పంచ్ గాడి నూకరాజు చేయూతనిచ్చారు. గురువారం ఆయన బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, బియ్యం, నగదు అందజేశారు. బాధితులను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈగల అప్పారావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నియోజకవర్గ విస్తారక్ ఈగల వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని సి.రాయవరంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఏనుగు ధర్మరాజు అధ్యక్షతన గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీ హయాంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. బీజేపీ నాయకులు దాకే కృష్ణారావు, కురాకుల రాజా, ఆలేటి నాగేశ్వరరావు, అడపా శివ ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సత్యనారాయణ


నూతన డీఎం సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జీవీ సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన డీఎం ఎస్.బాపిరాజు విశాఖపట్టణం కమర్షియల్ ఏటీఎంగా బదిలీపై వెళ్లారు. అక్కడ కమర్షియల్ ఏటీఎంగా పని చేస్తున్న సత్యనారాయణ ఇక్కడకు డీఎంగా బదిలీపై వచ్చారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి కుమార్ యూనియన్ నాయకులతో కలిసి బదిలీపై వెళ్లిన డీఎం బాపిరాజును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణకు ఘనంగా స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటనందూరు: స్థానిక్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు, విద్యుత్ లైన్‌పై చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. కోటనందూరు, కేతఈ చిన్నాయ్యపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కరెంటు ఉండదని తెలిపారు.

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ట్రాన్స్‌కో ఈఈ ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, అన్నవరం తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతుల చూపు.. డ్రమ్ సీడర్ వైపు

- మెట్టలో జోరుగా రబీ వరిసాగు పనులు
- డ్రమ్ సీడర్ పద్ధతిలో నాట్లు వేస్తున్న రైతులు
- తగ్గుతున్న పెట్టుబడి ఖర్చు


డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేసిన వరి పొలం


బెండపూడిలో డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేస్తున్న రైతు

తొండంగి: నియోజకవర్గంలో రబీ వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేందుకు వెదజల్లు, డ్రమ్‌సీడర్ విధానాలను అవలంబిస్తున్నారు. మెట్టలో ఏటా ఈ సాగు క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఎక్కువ మంది రైతులు డ్రమ్‌సీడర్ విధానంలో నాట్లు వేసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు.

నియోజకవర్గంలో సాగు వివరాలు

తుని నియోజకవర్గంలో రైతులు ఈ ఏడాది తుని మండలంలోని 180 ఎకరాల్లో వరి, 2705 ఎకరాల్లో అపరాలు, కోటనందూరు మండలంలో 38 ఎకరాల్లో వరి, 3980 ఎకరాల్లో అపరాలు సాగు చేస్తున్నారు. కాగా తొండంగి మండలంలోని పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది 6275 ఎకరాల్లో వరి, 3860 ఎకరాల్లో అపరాలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు పరిధిలో మరో రెండు వేల ఎకరాల వరకూ సాగు జరుగుతోంది. మెట్టప్రాంతాలైన బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం తదితర గ్రామాల్లో దాదాపుగా 70 ఎకరాల వరకూ రైతులు డ్రమ్‌సీడర్ పద్ధతిలో నాట్లు వేశారు.

సంప్రదాయ పద్ధతిలో వరిసాగుకు ఖర్చులు పెరగడంతో రైతుల చూపు వెదజల్లు, డ్రమ్‌సీడర్ విధానాలపై పడింది. వెదజల్లు పద్ధతిని తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో అధిక శాతం రైతులు అవలంబిస్తున్నప్పటికీ నియోజకవర్గంలో రైతులు డ్రమ్‌సీడర్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు.

సంప్రదాయ పద్ధతిలో అయితే ముందుగా పొలాలను దమ్ము చేయించి విత్తనాలు వేసి నారుమడి సిద్ధం చేస్తారు. అనంతరం మిగిలిన పొలాన్ని దమ్ము చేయించి కూలీలతో నాట్లు వేయిస్తారు. ఈ పద్ధతిలో నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.12 వేలకు పైగా ఖర్చు అవుతుంది. డ్రమ్‌సీడర్ విధానంలో విత్తనాలను నానబెట్టి డ్రమ్ముల్లో వేసి దమ్ము చేసిన పొలాల్లో క్రమపద్ధతిలో వేస్తారు. ఈ విధానంలో నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.6 వేల వరకూ ఖర్చువుతోంది. నారుమడి తయారీ, నారు తీసి నాట్లు వేసే ప్రక్రియ ఉండదు. దీంతో రైతులకు శ్రమ, ఖర్చు, కాలం ఆదా అవుతుండటంతో రైతులు క్రమంగా ఈ పద్ధతిపై దృష్టి సారిస్తున్నారు. దానికి తోడు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా డ్రమ్‌సీడర్లను రాయితీపై అందిస్తోంది. సాగులో పెట్టుబడి ఖర్చు భారీగా తగ్గడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించడంతో రైతులు ఈ పద్ధతిపై ఆసక్తి చూపుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



మండలంలోని రబీ వరి సాగు చేసే రైతులందరూ క్రమంగా డ్రమ్‌సీడర్ విధానంపై ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ ద్వారా డ్రమ్‌సీడర్లను రైతులకు అందించాం. ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉండటంతో మరిన్ని వాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము.

– ఎస్.నరసింహం, మండల వ్యవసాయశాఖాధికారి, తొండంగి

ఆరేళ్లుగా డ్రమ్‌సీడర్ విధానంలోనే సాగు



బెండపూడిలో నాకు ఉన్న మూడున్నర ఎకరాల్లో ఆరేళ్లుగా డ్రమ్‌సీడర్ విధానంలోనే వరి పంట సాగు చేస్తున్నాను. సంప్రదాయ పద్ధతి కంటే డ్రమ్‌సీడర్ విధానంలో భారీగా పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. దిగుబడి 30 బస్తాలకు పైగా వస్తోంది. పంటకు గాలి, వెలుతురు బాగా తగలడంతో తెగుళ్ల బెడద కూడా తక్కువే. నేలను అనువుగా మార్చుకుంటే ఈ విధానం రైతులకు ఎంతో మేలు.

– పాలచెర్ల వీరభద్రప్రసాద్‌చౌదరి, రైతు, బెండపూడి

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


తామరాడ ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కిర్లంపూడి: మండలంలోని గెదానాపల్లి, తామరాడ, గోనేడ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలపై కాకినాడ వ్యవసాయ సహాయ సంచాలకులు పద్మశ్రీ, మండల ఏఓ జోశా అమృత గురువారం తనిఖీలు నిర్వహించారు. గెద్దానాపల్లి శ్రీసూర్య ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల షాపులో రికార్డులు తనిఖీ చేసి పలు లోపాలు ఉన్నట్టు గుర్తించారు. షాపులో అనధికారికంగా ఉన్న రూ.4.96 లక్షల విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. ఎరువుల షాపుల వద్ద తప్పనిసరిగా రేట్లు తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఎంఆర్‌పీ రేట్ల కన్నా ఎక్కువకు అమ్మినా, రైతులకు బిల్లులు ఇవ్వకపోయినా, స్టాకు నమోదు రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పెద్దాపురం అగ్రికల్చర్ హబ్ అధికారి సుధామాధురి, వీఏఏలు ఆకుల సురేష్, మళ్ల రామకృష్ణ, గోడే రామలక్ష్మి, పాటంశెట్టి హరికృష్ణ పాల్గొన్నారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

జగ్గంపేట: నాసిరకం ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఆర్.శ్రీరామ్ హెచ్చరించారు. మండలంలోని జగ్గంపేట, కాట్రావులపల్లి గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువుల నిల్వల్లో తేడాలు ఉన్నట్టు గుర్తించి అమ్మకాలు నిలిపివేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని దుకాణ యజమానులకు సూచించారు. పెద్దాపురం ఏడీఏ దైవకుమార్, హబ్ మేనేజర్ జి కరుణాకరరాజు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన

రౌతులపూడి: మండలంలోని పి.చామవరంలో మహిళా పాడి రైతులకు జగనన్న పాలవెల్లువ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పశువైద్యాధికారి ఎం.వీర్రాఘవరావు మహిళా పాడిరైతులకు పాలవెల్లువ కార్యక్రమం ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి వీర్రాఘవరావు మాట్లాడుతూ పాడి రైతులను ఆర్థికంగా ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. దీనిలో భాగంగా మహిళా పాడి రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి అవసరమైన మేరకు ప్రభుత్వం ఎన్నో రాయితీలను అందిస్తోందన్నారు. వాటన్నింటినీ సద్వినియోగం చేసుకుని పాల ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. గ్రామాల్లోని మహిళా రైతులు ఈ పథకంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమూల్ డెయిరీ సంస్థ ప్రతినిధులు, పంచాయతీ, వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది పాల్గొన్నారు.

హైవేపై ట్రాక్టర్ బోల్తా

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు శివారులో గురువారం సాయంత్రం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట వైపు నుంచి బూడిద లోడుతో వస్తున్న ట్రాక్టర్ తాళ్లూరు శివారులో దాబా వద్ద రోడ్డు దాటే క్రమంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది చర్యలు తీసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


కోటనందూరు పీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం వడ్డిస్తున్న వైద్యాధికారి ఇందిరాప్రియదర్శిని


రాచపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు భోజనాలు అందిస్తున్న వైద్య సిబ్బంది

కోటనందూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు వైద్య సేవలు అందించారు. ప్రధానమంత్రి సురక్షా మంత్రిత్వ అభియాన్ యోజన (పీఎంఎస్ఎంఏ)లో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.ఇందిరాప్రియదర్శిని 85 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ గర్భిణులు రోజూ సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. స్థానిక దాత గజ్జలపు లక్ష్మణరావు ఆర్థిక సాయంతో మధ్యాహ్నం గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాచపల్లి పీహెచ్‌సీలో..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు 160 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు ఒమ్మంగి వైఎస్సార్ సీపీ నేత మామిడి నరసింహమూర్తి పాలు, భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

కోటనందూరు: మండలపరిధిలోని గ్రామాలకు రక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ తెలిపారు. ఎస్సార్‌పేట, కొత్తకొట్టాం గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకు (ఓహెచ్ ఆర్)లను గురువారం ఆయన దగ్గరుండి క్లీనింగ్ చేయించారు. నిబంధనల మేరకు ప్రతి నెలా ట్యాంకులను శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. వచ్చే వేసవిలో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది హాజరు, రికార్డులు ఆయన పరిశీలించారు.

గోల్డ్ చైన్ చోరీ

గండేపల్లి: మహిళ మెడలో బంగారు తాడు (గోల్డ్ చైన్) గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటనలై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై.గణేష్ కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మల్లేపల్లి రామాలయం వీధిలో నివాసం ఉంటున్న రావుల భూలక్ష్మి ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి తాగడానికి నీళ్లు కావాలని అడిగారు. ఆమె నీళ్లు తెచ్చి ఇచ్చిన అనంతరం ఆరుబయట కూర్చుని ఉన్న ఆమె మెడలో ఉన్న తాడును బలవతంగా లాక్కెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఎన్‌వీ నగరం, సీహెచ్‌వీ పడాలపురం గ్రామాల్లో గడపగడపకూ..


ఎన్‌వీ నగరంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

రౌతులపూడి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎస్ఎస్ పట్నం పంచాతీయ పరిధిలోని ఎన్‌వీ నగరం, సీహెచ్‌వీ పడాలపురం గ్రామాల్లో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గడిచిన మూడున్నరేళ్లలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు.

గ్రామంలో మురుగునీరు పోయేందుకు డ్రైన్లు నిర్మించాలని, వీధిరోడ్లు వేయాలని, రక్షిత తాగునీరు అందించాలని తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేందుకు గాను ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలన్నింటినీ ఎలాంటి అవినీతికి తావు లేకుండా గ్రామ వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

మాతా శిశు సంరక్షణకు పెద్దపీట

మాత, శిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఎస్ఎస్ పట్నం, ఎన్‌వీ నగరం గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ నూతన భవనాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారం అందిస్తోందన్నారు. చిన్నారులకు కార్పొరేట్ స్థాయిలో ఆట,పాటలతో కూడిన విద్యను అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్ ఎంపీపీలు సూరెడ్డి తిరుమలరాయల్ సాయి, వాసరెడ్డి లక్ష్మీభాస్కరబాబు, సర్పంచ్ సింగంపల్లి వెంకటలక్ష్మి, ఎంపీడీఓ ఎం.గోవింద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకీలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కిర్లంపూడి: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను తమకు ఇవ్వాలంటూ గురువారం పలువురు లబ్ధిదారులు స్థానిక తహసీల్దార్ వద్ద ఆందోళన చేశారు. తమ సమస్యలను తహసీల్దార్ కేవీ మాధవరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జగపతి నగరం, చిల్లంగి, కిర్లంపూడి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు జగపతినగరం పరిధిలో ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పట్టాలను పంపిణీ చేశామన్నారు. స్థల సంబంధిత సమస్యలు తొలిగిన వెంటనే లబ్ధిదారులు తమ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవచ్చన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వటానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సిద్ధంగా ఉన్నారని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు చెప్పడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు. పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు స్థలాలు ఇప్పించి న్యాయం చేయాలని జగ్గంపేట జనసేన కోఆర్డినేటర్ పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి బయో సమ్మిట్‌లో విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వీర్రాజు

తుని: కాకినాడలో జరిగిన ఎకోటోన్ రాష్ట్ర స్థాయి బయో సమ్మిట్‌లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు గురువారం తెలిపారు. శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రదర్శించిన ఇంటిగ్రేటెడ్ సెరికల్చర్ ప్రాజెక్టుకు ప్రథమ స్థానం, ప్రాబ్లెమ్ సాల్వింగ్ పోటీల్లో ప్రథమ, క్విజ్‌లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు పార్థసారథి, రామ రాఘవ, హిమాన్షు, రమణ, హర్షితలను విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సీహెచ్‌వీకే నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు అభినందించారు.

అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడికి సత్కారం


పెదశంకర్లపూడిలో చిట్టిబాబును సత్కరిస్తున్న జెడ్పీటీసీ రాజరాజేశ్వరి తదితరులు

ప్రత్తిపాడు: అన్నవరం శ్రీవీరవెంకటసత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక వర్గ సభ్యుడిగా నియమితులైన పెదశంకర్లపూడికి చెదిన దళే వీరసూర్యనారాయణ (చిట్టిబాబు)ను గురువారం సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ప్రత్తిపాడు ఉప సర్పంచ్ నూకరాజు, పార్టీ నాయకులు ఆచంట రాంబాబు, బెహరా నానాజీ, ధరణాలకోట తాతబ్బాయి తదితరులు దళే చిట్టిబాబును శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు


దివ్యాంగ చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీ రాంబాబు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళితే కఠిన చర్యలు

గండేపల్లి: అధిక లోడుతో ఇతరుల ప్రాణాలకు హాని తలపెట్టవద్దని ఎస్సై వై.గణేష్ కుమార్ వాహనదారులకు హితవు పలికారు. మండలంలోని గండేపల్లిలో జాతీయ రహదారిపై అధిక లోడుతో వెళుతున్న వాహనాలను గురువారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి అధిక లోడుతో వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారమే లోడును తరలించాలని, డ్రైవర్లకు లైసెన్స్‌లు, వాహనాలకు రికార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సుమారు 13 వాహనాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గురుకుల పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థుల పరార్

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరు శివారు బాలయోగి గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఐదుగురు పరారయ్యారు. దీనిపై పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సామ్లానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ తెలిపారు. బుధవారం రాత్రి స్టడీ అవర్ అనంతరం నిద్రకు ఉపక్రమించారని, గురువారం ఉదయం అల్పాహారానికి హాజరు కాలేదన్నారు. దీంతో తనిఖీ చేయగా ఐదుగురు విద్యార్థులు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను విచారించినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విప్పక అఖిల్ (కొండవారపేట), తిరగటి దినేష్ కుమార్ (కృష్ణాపురం), టి.నాని (వీరవరపేట), కడింపల్లి సుధీర్ (శృంగవృక్షం), కె.చరణ్‌తేజ (తొండంగి) పరారైనట్టు ఎస్సై వివరించారు. దీనికై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎస్‌ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు


దాడుల్లో స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, ఆటో, నిందితులతో ఎస్ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక సర్కిల్‌లో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బంది దాడులు నిర్వహించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. నల్లబెల్లం, అమ్మోనియా, ఆటో స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఈబీ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం శంఖవరం – శృంగధార మార్గంలో తనిఖీలు చేపట్టగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 150 కేజీల నల్లబెల్లం, మూడు కేజీల అమ్మోనియా పట్టుబడింది. ఈ కేసులో నల్లబెల్లం తరలిస్తున్న శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామానికి చెందిన కుంచే హరిబాబు, సారా తయారీదారుడు మేకల చిన్నబ్బాయిలను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి, బవురువాక గ్రామాల్లో కాళ్ల బుచ్చిరాజు, జలుమూరి దుర్గాభవానీలను అరెస్టు చేసి, ఒక్కొక్కరి వద్ద నుంచి ఐదేసి లీటర్ల చొప్పున సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన


ప్రత్తిపాడులో సెల్ టవర్ నిర్మించవద్దంటూ నిరసన తెలుపుతున్న స్థానికులు

ప్రత్తిపాడు: గ్రామంలో సుమ్మిట్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌డీఐపీఎల్) సెల్ టవర్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానికులు గురువారం సాయంత్రం ఆందోళన చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో రక్షిత మంచినీటి ట్యాంకు వద్ద సెల్ టవర్ నిర్మాణానికి సుమ్మిత్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాట్లు చేసింది. నివాస గృహాల సముదాయం వద్ద ఈ టవర్ నిర్మాణం కోసం పునాది తవ్వుతుండగా స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని పనులను నిలిపి వేయించారు. ఓ వైపు ఉన్నత పాఠశాల, పక్కనే ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం, మంచినీటి ట్యాంకు, వైఎస్సార్ వెల్‌నెస్ (ఆరోగ్య కేంద్రం) ఉన్నాయని వీటి మధ్య ఆరోగ్యానికి చేటు తెచ్చే సెల టవర్‌ను నిర్మించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తక్షణమే టవర్ నిర్మాణాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కార్మికులు సెల్ టవర్ నిర్మాణ పనులను ఆపి వేశారు.